క్లుప్తంగా

నేడు 'వలంటీర్లకు వందనం'

జగ్గంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు వలంటీర్ల వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి.హరిక్రిష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు హాజరై వలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందజేయనున్నారని తెలిపారు.

మహిళలకే పెద్దపీట


కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనపాలనలో మహిళలకే పెద్దపీట వేశారని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం సీఎం జగన్ అధికారం చేపట్టి నాలుగేళ్లు కావడంతో డ్వాక్రా మహిళల సమక్షంలో ఎంపీపీ కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అధికారం చేపట్టి నాలుగేళ్ల పాలన పూర్తికావడం హర్షణీయమన్నారు. ఆయన హయాంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. అన్నింటిలోనూ 50 రిజర్వేషన్ ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జీ, ఏపీఎం సత్యప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి

ఏలేశ్వరం: అనకాపల్లిలో గురువారం జరగనున్న అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం 5వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు కోరారు. స్థానిక సీపీఎం (ఎంఎల్)లిబరేషన్ కార్యాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అర్జునరావు మాట్లాడుతూ మహాసభలో ప్రజాసమస్యలపై చర్చిస్తామన్నారు.

సర్పంచులకు అవగాహన


సర్పంచులతో యోగా చేయిస్తున్న ఈఓపీఆర్డీ

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పర్యావరణహిత జీవనశైలిపై పంచాయతీ విస్తరణాధికారి అరుణ్‌కుమార్ సర్పంచులు, ప్రభుత్వ సిబ్బందికి అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన పర్యావరణ లైఫ్‌స్టైల్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. రోజూ సమతుల్య ఆహారం తీసుకుంటూ ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని సూచించారు. అనంతరం సర్పంచులతో యోగా చేయించారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

తుని: పెన్షన్ తీసుకునే విశ్రాంతి ఉద్యోగులంతా విధిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని పెన్షనర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆంజనేయప్రసాద్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తుని, కోటనందూరు మండలాల పరిధిలో 430 మంది విశ్రాంత ఉద్యోగులు ఈ-కేవైసీ చేయించుకోలేదని ట్రెజరీ అధికారులు చెబుతున్నారన్నారు. ఈ-కేవైసీ చేయించుకోకపోతే పింఛను ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. పెన్షనర్ల అసోసియేషన్ వాట్సాప్ గ్రూపులో ఈ-కేవైసీ చేయించుకోని వారి వివరాలు ఉంచామన్నారు. కేవైసీ నమోదులో సబ్‌ట్రెజరీ అధికారులు పూర్తిగా సహకరిస్తున్నారని, మరిన్ని వివరాలకు 9440729671 నంబరును సంప్రదించాలని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ

గండేపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణపై తాళ్లూరులో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గండేపల్లి: గ్రామ శివారులో అక్రమంగా సారా విక్రయిస్తున్న ఎల్లంకి అప్పారావును అరెస్టు చేసి అతని నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. అతనిని పెద్దాపురం కోర్టుకు తరలించనున్నట్టు తెలిపారు.

మెప్మా ఆర్పీల శిక్షణ ప్రారంభం

సామర్లకోట: కాకినాడ జిల్లా పరిధి మున్సిపాలిటీలో మెప్మా రీసోర్సు పర్సన్లకు ఇస్తున్న శిక్షణలో భాగంగా బుధవారం కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని ఆర్పీలకు రెండు రోజుల శిక్షణను మెప్మా జిల్లా రీసోర్సు పర్సన్ రాజశేఖర్ ప్రారంభించారు. కార్పొరేషన్ పరిధిలో 209 మందికి మెప్మా ఆర్పీలు ఉండగా బ్యాచ్‌కు 52 మంది చొప్పున శిక్షణ ఇస్తున్నామని డీఆర్పీ అన్నారు. జూన్ ఒకటో తేదీతో కాకినాడ కార్పొరేషన్ ఆర్పీల శిక్షణ ముగుస్తుందన్నారు.

చిరుధాన్యాల సాగుకు వేళాయె..

- ఉచితంగా విత్తన సరఫరాకు ప్రణాళిక
- తక్కువ పెట్టుబడితో నికరంగా ఆదాయం


రాజుపేటలో వేసవి దుక్కులు చేసిన మెట్ట భూములు

తుని రూరల్: పూర్వపు ప్రజలు బలవర్ధకమైన ఆహారంగా చిరుధాన్యాలను తీసుకుని బలిష్ఠంగా ఉండడమే కాకుండా ఆరోగ్యవంతంగా జీవించేవారు. కాలక్రమేనా వాటి వాడకం తగ్గింది. మారుతున్న కాలంలో ప్రస్తుతం సోకుతున్న వ్యాధులను తట్టుకునేందుకు మళ్లీ చిరుధాన్యాలను ప్రజలు ఆహారంగా చేసుకుంటున్నారు. కరోనా వ్యాధి ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించడంతో చిరుధాన్యాలు పండించడం, వినియోగించడంలో విశేష అనుభవం ఉన్న భారతీయులు కరోనాను తట్టుకుని క్షేమంగా ఉండడం ఒక కారణమైంది. దీంతో పౌష్టికాహారంలో చిరుధాన్యాల పాత్ర కీలంగా గుర్తించారు. ఇటీవల చిరుధాన్యాలైన చోళ్లు(రాగులు), కొర్రలు, జొన్నలతో చేసిన వంటకాలకు డిమాండ్ ఏర్పడడంతో వాటి వినియోగం పెరుగుతోంది. ఆరోగ్యంతోపాటు జీవిత కాలాన్ని కూడా పెంచడానికి చిరుధాన్యాలు దోహదపడుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య, ఆహార సంస్థలు గుర్తించాయి. దీంతో ఈ ఏడాదిని చిరుధాన్యాల ఉత్పత్తుల పెంపు ఉత్సవాల సంవత్సరంగా ప్రపంచ ఆహార సంస్థ ప్రకటించింది. చిరుధాన్యాలు, సేంద్రియ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రాలకు సూచించింది. విత్తనాలు ఉచితంగా అందించి సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి జూన్ నుంచి అమలు చేయనుంది. ఇప్పటికే మెట్ట రైతులు దుక్కులు చేయడంతో కొద్దిపాటి వర్షాలు కురిసినా చిరుధాన్యాల సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు.

సాగు పెంపునకు ప్రణాళిక

ఆరుతడిగా సాగయ్యే చిరుధాన్యాలను సాగునీటి వసతులు లేని మెట్ట ప్రాంతంలో పండించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. జూన్ నుంచి ప్రారంభమయ్యే ఖరీఫ్‌లో కాకినాడ జిల్లాలో తొమ్మిది మండలాల్లో రాగులు, కొర్రలు, జొన్న తదితర చిరుధాన్యాలు సాగుకు వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు రూపొందించింది. తుని మండలంలో 60 ఎకరాలు, కోటనందూరు 20 ఎకరాలు, తొండంగి 20 ఎకరాలు, ప్రత్తిపాడు 80 ఎకరాలు, ఏలేశ్వరం 60 ఎకరాలు, శంఖవరం 40 ఎకరాలు, రౌతులపూడి 40 ఎకరాలు, జగ్గంపేట 40 ఎకరాలు, గండేపల్లి 20 ఎకరాలలో రైతులు సాగు చేపట్టనున్నారు. ఆయా పంటల సాగును చేపట్టే రైతులకు ప్రభుత్వం విత్తనాలిచ్చి ప్రోత్సహిస్తోంది. ఎకరాకు జొన్నలు నాలుగు కేజీలు, రాగులు, కొర్రలు రెండేసి కేజీలు చొప్పున విత్తనాలను ఉచితంగా ఇవ్వనుంది.

> **తక్కువ పెట్టుబడితో ఆదాయం**
>
> 
>
> ఈ ఖరీఫ్‌లో వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్ పరిధిలో 320 ఎకరాల్లో చిరుధాన్యాల సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. తక్కువ కాలంలో ఫలసాయం చేతికి అందే చిరుధాన్యాలను ఖరీఫ్, రబీ, వేసవి పంటగా సాగు చేసుకోవచ్చు. సాగునీటి వసతులు లేని భూములను వృథాగా వదిలేయకుండా చిరుధాన్యాల సాగుతో రైతులు నికరంగా ఆదాయం పొందవచ్చు. చిరుధాన్యాలను అంతర పంటలుగా సాగు చేసేందుకు మెట్ట భూములు, కొబ్బరి, పామాయిల్, కోకో, మామిడి, జీడి తదితర మొక్క తోటలు అనుకూలంగా ఉంటాయి. జూన్ నెల మొదటి వారంలో విత్తనాలు చేరుతాయి. విత్తనాలు గొడౌన్‌కు చేరిన వెంటనే రైతులకు ఉచితంగా అందిస్తాం.
>
> – సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

బాబోయ్ ఎండలు


వెలవెలబోతున్న ఏలేశ్వరంలో ప్రధాన రహదారి

ఏలేశ్వరం: ఎండలు చుర్రుమంటున్నాయి. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నియోజకవర్గంలో బుధవారం 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం నుంచి ఎండ వేడిమి ఎక్కువగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే రహదారులు వెలవెలబోయాయి. వాహనాల రాకపోకలు తగ్గుముఖం పట్టాయి. ఎండల తీవ్రతకు మూగజీవాలు దాహార్తిని ఎదుర్కొన్నాయి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అడపాదడపా పడే వర్షాలు లేకపోవడంతో ప్రజలు ఎండలకు అల్లాడుతున్నారు.

27న మండల సమావేశం

రౌతులపూడి: ఈ నెల 27వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.గోవింద్ తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

సంక్షేమ పథకాల అమలులో వలంటీర్లే కీలకం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- గ్రామాల్లో వలంటీర్లకు వందనం


ప్రత్తిపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

ప్రత్తిపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అవినీతికి తావులేకుండా ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక సరయు కన్వెన్షన్ హాలు ఆవరణలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు పారదర్శకంగా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం వారిని సత్కరించి, నగదు పురస్కారాలను అందిస్తున్నట్టు చెప్పారు. సీఎం నేతృత్వంలో అమలవుతున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే తలమానికమని అన్నారు. ప్రజలు, అధికారులకు మధ్య వారధిలా వ్యవహరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్న వలంటీర్లు మరింత ఉత్తమ సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ సభలో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లు తుంపాటి సత్తిబాబు(గోకవరం), పెచ్చెట్టి వీరమణి (ధర్మవరం), సీహెచ్ ప్రసాద్ (పోతులూరు), పట్నాల లక్ష్మీదుర్గ (పెద శంకర్లపూడి), గొంప లక్ష్మి (ఏలూరు)లను 'సేవా రత్న' అవార్డుతో ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణ చంద్ర ప్రసాద్ సత్కరించారు. ఈ కార్యక్రమానికి తొలుత ఎమ్మెల్యే పర్వతను ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం శాలువా కప్పి, సత్కరించారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, అన్నవరం ట్రస్ట్‌బోర్డు మెంబర్ దోనే చిట్టిబాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, సొసైటీల అధ్యక్షుడు గొంతిన సురేష్, చెక్కపల్లి సత్తిబాబు, కొప్పన గంగారావు, సీహెచ్‌సీ కమిటీ సభ్యుడు ఏడిద రెడ్డినాయుడు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జి.వెంకటరత్నం, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్లకు గౌరవ సత్కారం


జగపతినగరంలో వలంటీర్లను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి అధ్యక్షతన మండలంలోని జగపతినగరం 1, 2 సచివాలయాల పరిధిలో వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైస్సార్ సీపీ నాయకుడు పెంటకోట నాగబాబు మాట్లాడుతూ 50 కుటుంబాలలో వలంటీర్ కొడుకు, కుతురులా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. తొలిత 45 మంది వలంటీర్లకు నగదుతో పాటు, సాల్వా, ప్రశంస పత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ బిళ్ళకుర్తి నాగమణి, మండల సచివాలయల కన్వీనర్ పెనగంటి రాజేష్, వైస్సార్ సీపీ నాయకులు సంఘన వెంకటేశ్వరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దాడి పెద్దబుజ్జి, యల్లపు నానాజీ, ఆళ్ళ రామశివ, అడారి గంగబాబు, వేగి సాంభశివ, డిజిటల్ అసిస్టెంట్స్ సత్యప్రకాష్, రమేష్, కన్వీనర్లు ఉన్నారు.


సన్మాన కార్యక్రమంలో వలంటీర్లు, గ్రామస్తులు

యర్రంపాలెం వలంటీర్లకు సన్మానం

గండేపల్లి: యర్రంపాలెంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ గ్రామ సచివాలయ కన్వీనర్ నిమ్మలపూడి శ్రీహరి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లను సన్మానించి వారి సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గృహసారథి పెదపాటి వీరబాబు, పార్టీ నాయకులు మద్దుకూరి రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, శ్రీహరి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జగ్గంపేట: మల్లిసాలలో బుధవారం వలంటీర్లకు వందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవామిత్రలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీటీసీ అత్తులూరి నాగరత్నం, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- జి.కొత్తపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం


జి.కొత్తపల్లిలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

శంఖవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. బుధవారం జి.కొత్తపల్లిలో గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. రానున్న కాలంలో ఈ పథకాలన్నీ అమలవాలంటే మరోసారి జగన్‌ను సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, సర్పంచ్ ఈగల విజయదుర్గ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు యెద్ల సత్యనారాయణ, కోన బాబ్జి, ఈగల మాణిక్యాలరావు, ఈగల గంగ, కలగాని దేవుళ్లు, పల్లా నాగిని, గదుల దేవుళ్ల తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన


భూమిపూజ చేస్తున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

కోటనందూరు: జగన్నాథపురం-భీమవరపుకోట రోడ్డులో వెంకటాచలం చెరువుపై రూ.40 లక్షలతో నిర్మించే బ్రిడ్జికి ఎంపీపీ లగుడు శ్రీనివాసు బుధవారం శంకుస్థాపన చేశారు. బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఎంపీపీ శ్రీనివాసు సూచించారు. 2012వ సంవత్సరంలో నీలం తుపాను సమయంలో ఇక్కడ రోడ్డుకు గండి ఏర్పడింది. అప్పటి నుంచి ఈ రోడ్డులో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ రోడ్డుపై భీమవరపుకోట, ఎస్సార్‌పేట, అప్పలరాజుపేట, బిళ్లనందూరు గ్రామాలతో పాటు విశాఖ జిల్లాలోని మరికొన్ని గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గత పదేళ్లలో అనేక పర్యాయాలు ఆయా గ్రామాల ప్రజలు పాలకులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. ఈ సమస్యను ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆధ్వర్యంలో మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లెక్కల ఉపేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు కురందాసు రాంబాబు, భీమిరెడ్డి నాగబాబు, ఆర్‌అండ్‌బీ ఏఈ మాధవి పాల్గొన్నారు.

లాకులు నిర్మించాలని వినతి

నీలం తుపాను సమయంలో రోడ్డుతో పాటు చెరువుకున్న లాకులు సైతం కొట్టుకుపోయాయి. చెరువులో నీటిని ఆయకట్టు రైతుల అవసరానికి అనుగుణంగా విడుదల చేసుకునేందుకు వీలుగా ఈ లాకులు ఏర్పాటు చేశారు. గత పదేళ్లగా లాకులు లేకపోవడంతో చెరువు కింద ఉన్న వెయ్యి ఎకరాల ఆయకట్టు వర్షాధారంగా మారిపోయింది. ఇప్పటికీ లాకులు అలాగే ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జితో పాటు లాకులు కూడా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కౌలు కార్డులపై అవగాహన సదస్సులు


కోటనందూరు సదస్సులో మాట్లాడుతున్న ఏఈఓ శివకుమారి


రాజుపేటలో కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బుద్దాల సత్తిబాబు, వ్యవసాయ సిబ్బంది

కోటనందూరు: మండలంలోని కోటనందూరు, కాకరాపల్లి గ్రామాల్లో బుధవారం కౌలుకార్డుల జారీపై అవగాహన సదస్సులు జరిగాయి. ఈ సదస్సుల్లో ఏఈఓ కేవీ శివకుమారి కౌలుకార్డుల జారీ విధివిధానాలు, కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. 11 నెలల కాలపరిమితి ఉండే ఈ కార్డుల ఆధారంగా ప్రభుత్వ పథకాలు పొందవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని అర్హత ఉన్న కౌలురైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కౌలురైతులకు కౌలు అర్హత పత్రాలు పంపిణీ చేశారు. వీఏఏలు నల్లమిల్లి సురేష్, రావాడ మౌళీప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ

తుని రూరల్: సాగుదారుల హక్కు పత్రాలను కౌలుదారులు సద్వినియోగం చేసుకోవాలని రాజుపేట సర్పంచ్ బుద్దాల సత్తిబాబు అన్నారు. బుధవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో లోవకొత్తూరు, రాజుపేట పంచాయతీల్లో కౌలుదారుల అవగాహన సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా వ్యవసాయ, రెవెన్యూశాఖలు సంయుక్తంగా జారీ చేసిన సీసీఆర్‌సీ కార్డులను అర్హులైన కౌలుదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగుదారుల రక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను తీసుకువచ్చిందని, అందులో భాగంగానే సీసీఆర్‌సీ కార్డులు జారీ చేస్తుందన్నారు. ఈ కార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఈఓ పి.జగ్గప్పారావు, వీఏఏలు, రైతులు, సాగుదారులు పాల్గొన్నారు.

సీపీఐ మండల సమావేశం

గోకవరం: స్థానిక లారీ యూనియన్ హాల్‌లో బుధవారం సీపీఐ మండల సమావేశం నిర్వహించారు. కె.జ్యోతీరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి తాటిపాక మధు హాజరై మాట్లాడుతూ కొత్త జిల్లా ఏర్పడినా ఒక్క పరిశ్రమ కూడా జిల్లాకు రాలేదన్నారు. పలు పార్టీల ప్రజాప్రతినిధులు అనేక సమస్యలపై ప్రభుత్వానికి తెలిపినా న్యాయం జరగలేదన్నారు. అనేక సార్లు ముఖ్యమంత్రి జిల్లాకు వచ్చినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆయన తెలిపారు. జె.వినయ్, కృష్ణ, సుమ ఇందిరా తదితరులు ఉన్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలు జరిగితే చర్యలు తప్పవు


కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్

కిర్లంపూడి: రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.వెంకటమాధవరావు హెచ్చరించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్మహించారు. మాధవరావు మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యం సకాలంలో అందేలా డీలర్లు, ఎండీయూ సిబ్బంది సమన్వయంతో పని చేయాలయాన్నారు. బియ్యం పంపిణీలో లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, మరోసారి వస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

పేకాడుతున్న పది మంది అరెస్టు

అన్నవరం: స్థానిక మెయిన్ రోడ్డులోని ఓ లాడ్జిలో పేకాడుతున్నారని పెద్దాపురం డీఎస్పీకి అందిన సమాచారం మేరకు అన్నవరం పోలీసులు బుధవారం రాత్రి ఆకస్మికంగా దాడి చేశారు. పేకాడుతున్న పది మందిని అదుపులోకి తీసుకుని రూ.1,16,000 నగదు స్వాధీనం చేసుకున్నట్టు అన్నవరం ఏఎస్ఐ అజయ్‌బాబు తెలిపారు.


చైన్ స్నాచర్ అరెస్టు

బంగారు వస్తువులు, బైక్ స్వాధీనం


విలేకరులతో మాట్లాడుతున్న ఎస్సై పవన్‌కుమార్ చిత్రంలో బంగారు వస్తువులు, బుల్లెట్

ప్రత్తిపాడు: చైన్ స్నాచర్‌కు పాల్పడుతున్న వ్యక్తిని బుధవారం ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక జాతీయ రహదారిపై నరేంద్రగిరి వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి రెండు బంగారు వస్తువులు, బుల్లెట్ మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై ఎం.పవన్‌కుమార్ వివరాలను వెల్లడించారు. ఈనెల 11న భార్య భర్తలు బైక్‌పై తుని నుంచి జగ్గంపేట వైపు వెళ్తున్న వారిని బుల్లెట్‌పై వెంబడించి, స్థానిక పాదాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో మహిళ మెడలోని నక్లెస్ లాక్కుపోయిన సంఘటనలోనూ, అదే ఫక్కీలో 22న గండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జెడ్ రాగంపేట వద్ద బంగారు నల్లపూలల దండను దోచుకున్నాడు. గొల్లప్రోలు మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన తంగెళ్ల శేఖర్‌ను స్థానిక నరేంద్రగిరి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడి నుంచి రూ.2.50 లక్షల విలువ గల నక్లెస్, నల్లపూసల దండను, బుల్లెట్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వ్యాపారంలో నష్టాలు రావడం, అనారోగ్యానికి గురైన కుమారుడి వైద్యం నిమిత్తం సొమ్ము అవసరం పడి, ఈ తరహా చోరీలకు పాల్పడ్డాడని చెప్పారు. నిందితుడిని స్థానిక కోర్టులో హాజరుపరచినట్టు ఎస్సై ఎం.పవన్‌కుమార్ తెలిపారు.

చురుగ్గా దర్బారు మండపం పనులు


సత్యదేవుని మండపం పనులు చేస్తున్న కూలీలు

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి ఈశాన్య భాగంలో ఉన్న మండపాన్ని విస్తరించే పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో ఇక్కడ దర్బారు మండపం ఉండేది. ఆ మండపానికి, స్వామివారిని దర్శించి భక్తులు వెలుపలకు వచ్చే మండపానికి మధ్య ఉన్న గోడను తొలగించి విశాలంగా చేస్తున్నారు. తరువాత ఆలయ సిబ్బంది కార్యాలయంగా వాడుకుంటున్న గదిని కూడా తొలగించారు. ఇక్కడ మరంత వెలుగు రావడానికి మెస్ ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

నూతన మండపంలో తీర్థ ప్రసాదాలు

దర్బారు మండపం విశాలం చేసిన తరువాత ప్రస్తుతం సరస్వతీదేవి విగ్రహం ఉన్న మండపంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారి ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. అక్కడే భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చి వెలుపలకు వెళ్లేలా క్యూ లైన్ ఏర్పాటు చేయనున్నారు. అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను దాత మట్టే సత్యప్రసాద్ నిర్మించిన 'సహస్ర దీపాలంకార సేవ ' మండపంలో నిర్వహించనున్నట్టు తెలిపారు.

న్యాయ చట్టాలపై అవగాహన ఉండాలి

సామర్లకోట: న్యాయ చట్టాలపై ఎంపీడీఓలు అవగాహన పెంచుకోవాలని న్యాయవాది త్రినాథరావు అన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఎంపికైన ఎంపీడీఓలకు ఇస్తున్న శిక్షణలో భాగంగా బుధవారం న్యాయ పరమైన అంశాలపై వారికి శిక్షణ ఇచ్చారు. సమాచార హక్కు చట్టం ప్రకారం అడిగిన విషయాలకు సకాలంలో సమాధానం ఇవ్వాలన్నారు. కోర్టు నోటీసులు వచ్చిన సమయంలో వెంటనే స్పందించాలని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 మంది ఎంపీడీఓలు నూతనంగా బాధ్యతలు స్వీకరించగా వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల పాటు శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేసింది. దీనిలో భాగంగా గత నెలలో బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రంలో ఎంపీడీఓలో శిక్షణ పూర్తి చేసుకొని ఈనెల ఒకటో తేదీన స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రానికి 34 మంది ఎంపీడీఓలు శిక్షణకు వచ్చారు. సోమ, మంగళవారం ఫీల్డ్ విజిట్ శిక్షణ అనంతరం బుధవారం క్లాసు రూమ్ శిక్షణ జరిగింది.

ఇంటర్ పరీక్షలకు 13 మంది గైర్హాజరు

కిర్లంపూడి: స్థానిక జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ కల్యాణ్‌కుమార్ తెలిపారు. ఫస్టియర్ 134 మంది విద్యార్థులకు గాను 125, సెకెండియర్ 33 మంది విద్యార్థులకు గాను 29మంది హాజరయ్యారని, 13 మంది గైర్హాజరైనట్టు ఆయన తెలిపారు.